క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత

కూసుమంచి: మృతిచెందిన రైతు కుటుంబానికి మంజూరైన ప్రమాద బీమా చెక్కును మంగళవారం ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, కల్లూరిగూడెం సొసైటీ చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు అందజేశారు. మండలంలోని హీరామాన్‌తండాకు చెందిన అజ్మీరా బాలాజీ విద్యుదాఘాతంతో మృతిచెందగా.. సొసైటీ ద్వారా మంజూరైన రూ.1.5లక్షల బీమా చెక్కును మృతుడి భార్య విజయకు ఎంపీపీ, చైర్మన్ అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఇన్‌చార్జ్ సెక్రటరీ నారోజు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించాలన్నారు. తల్లిదండ్రులు తమ విలువైన సమయాన్ని కొంత పిల్లలతో గడపాలని, చిన్నతనం నుండే నైతిక విలువలనుబోధించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సీఆర్‌ఓ మురళి కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, వివిధ విభాగాల ఇంచార్జ్‌లు చార్లెస్, ముస్తఫా, అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు రామ్మూర్తి డిమాండ్ చేశారు. బీసీల సమస్యల సాధనకై ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ, ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యాన చేస్తున్న ఆందోళన మంగళవారం రెండో రోజుకు చేరగా.. ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో 50శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, కుల గణన చేయాలని, ఉద్యోగులకు ప్రమోషన్‌లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాచారి, వెంకటేశ్వర్లు, వెంకటాచారి, మహేష్, వెంకటరామయ్య, నాగేశ్వరావు, పాపారావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మానవత్వం

కూసుమంచి: మండలంలోని చౌటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నరేందర్, వీరేందర్, విజయలక్ష్మి, జయశీల ఖమ్మం నుంచి కారులో పాఠశాలకు వస్తుండగా జాతీయరహదారిపై లోక్యాతండా సమీపంలోనాగయ్యగూడెంకు చెందిన గణేష్ అనే యువకుడు కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం పైనుంచి పడిపోయి తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో ఉపాధ్యాయులు క్షతగాత్రుడుని తమ కారులో కూసుమంచి తీసుకొచ్చి సీఆర్పీ జాఫర్ సహకారంతో అక్కడి నుంచి 108లో ఖమ్మంకు తరలించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	ఆరెంజ్
ఆదిత్య	దసరా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగ మార్తాండ

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	40		10
కాకర	38	చుక్కకూర	2
సోరకాయ	16		10
బీర	56	తోటకూర	2
దొండ	30		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	50	మెంతికూర	5
క్యాబేజీ	18		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	26		15
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

లైసెన్సా.. మాకేం వద్దు!

కేఎంసీ పరిధిలో వ్యాపారుల ఇష్టారాజ్యం

- అయినా పట్టింపులేనట్లుగా అధికారులు
- ట్రేడ్ లైసెన్సుల జారీలో అలసత్వం
- ఆదాయానికి గండి పడుతున్న వైనం
- ఫలించని ప్రత్యేక డ్రైవ్‌లు



కేఎంసీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరాలు, పట్టణాల అభివృద్ధి ప్రధానంగా ఆదాయ వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు చెల్లించే పన్నులు, పౌర సేవలందించేందుకు చెల్లించే రుసుములు, లైసెన్సుల మంజూరు ద్వారా ఆదాయం అధికంగా వస్తుంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి, పంపు పన్నుల తర్వాత అధికంగా ఆదాయం సమకూరేది ట్రేడ్ లైసెన్సుల ద్వారానే. పన్నుల వసూళ్లలో రాణిస్తున్న కేఎంసీ అధికారులు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రేడ్ లైసెన్సుల ద్వారా నగరంలో రూ.కోటి వరకు ఆదాయం పొందొచ్చని అధికారులు అంచనా వేసినప్పటికీ ఆ స్థాయిలో కార్యచరణ చేయలేకపోతున్నారు. దీంతో కేఎంసీ పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

పెరుగుతున్న అలసత్వం..

ఖమ్మం నగరం విస్తరించడం, పలు అవసరాల రీత్యా నగరానికి వచ్చి వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగడంతో ఇక్కడ వందల రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. వేలాది మంది దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో జనావాసాలు కన్నా వ్యాపార వాణిజ్య సముదాయాలే ఎక్కువగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. గాంధీచౌక్, కమాన్‌బజార్, కస్బాబజార్, వైరారోడ్డు, కాల్వొడ్డు, ట్రంక్‌రోడ్, జెడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, మమతా రోడ్డు ఇలా అన్ని ప్రాంతాల్లో వేలాది సంఖ్యలో వ్యాపార దుకాణాలు ఉన్నాయి. అయితే వీటిల్లో ట్రేడ్ లైసెన్సులు కలిగిన దుకాణాలు మాత్రం వందల సంఖ్యలో కూడా లేవనే ఆరోపణలు ఉన్నాయి. ట్రేడ్ లైసెన్సులు లేని దుకాణాలకు లైసెన్సులు జారీ చేయడంలో కేఎంసీ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సగం మంది కూడా లైసెన్సులు తీసుకోవడం లేదని, దీని మూలంగా కేఎంసీ ఆదాయం కోల్పోతుందన్న విమర్శలు ఉన్నాయి.

ఆదాయం కోల్పోతున్న కేఎంసీ..

ఖమ్మం నగరం దినదినాభివృద్ధి జరుగుతున్న తరుణంలో ఖర్చులకు అవసరమైన నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి పౌర సేవలందించేందుకు వచ్చే ఆదాయం ప్రధానమే. నగరంలో వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ యాక్ట్ ప్రకారం.. ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి. అయితే నగరంలో వ్యాపార సముదాయాలు 10 వేలకు పైగా ఉన్నా.. లైసెన్సులు కలిగి ఉన్నది మాత్రం చాల తక్కువ. గతేడాదితో పోలిస్తే ఆస్తి, పంపు పన్నుల ద్వారా కేఎంసీకి భారీగానే ఆదాయం వచ్చినప్పటికీ ట్రేడ్ లైసెన్సుల ద్వారా మాత్రం ఆశించన మేరా రావడం లేదు. ఇక నగరంలో సుమారు 200 ఆస్పత్రులు ఉండగా.. వారంతా కొత్త చట్టం ప్రకారం పన్నులు చెల్లించలేమని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకోగా.. వారి నుంచి సుమారు రూ.2 కోట్ల ఆదాయం నిలిచిపోయిందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఇతర భవనాల్లో వ్యాపార సముదాయాలకు సంబంధించి కమర్షియల్‌కు బదులు రెసిడెన్షియల్ భవనాలుగా చూపించి పన్నులు చెల్లిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో కేఎంసీకి రావాల్సిన ఆదాయంలో భారీగా గండి పడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఫలించని ప్రత్యేక డ్రైవ్‌లు..

నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాగానే కార్పొరేషన్ అధికారులు ట్రేడ్ లైసెన్సులపైనే దృష్టి సారిస్తూ వస్తున్నారు. ప్రతి ఏడాది ప్రత్యేక బృందాలు, కౌంటర్లను ఏర్పాటు చేసి లైసెన్సులు జారీ చేస్తున్నా.. వాటిని తీసుకునేందుకు మాత్రం వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది కేఎంసీ కమిషనర్, రెవెన్యూ అధికారులు ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక దృష్టి సారించినా ఫలితం మాత్రం కనిపించడం లేదు. గతేడాది నవంబర్‌లో ట్రేడ్ లైసెన్సుల కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో ప్రాంతంలో వారం రోజుల పాటు డ్రైవ్ నిర్వహించినా ఫలితం రాలేదని తెలుస్తోంది. ఖమ్మం నగరంలో సుమారు 9,800కు పైగా వ్యాపార సముదాయాలు ఉంటే ఇప్పటి వరకు కేవలం 3,100 ట్రేడ్ లైసెన్సులు మాత్రమే జారీ అయినట్లు సమాచారం.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..

ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఆస్తి, పంపు పన్నులపై అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి బిల్లు కలెక్టర్లు, ఇతర సిబ్బంది ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీనివాస్, ఆర్ఓ, కేఎంసీ

పంటలన్నీ ప్రభుత్వమే కొనాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: రబీ సీజన్‌లో అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. అనంతరం ఆయన పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.నాగేశ్వరరావు, పాశం అప్పారావు, మారుతి మల్లయ్య, నాగిరెడ్డి, సత్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలకు కేరాఫ్ తెలంగాణ



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పరీక్షా ప్రశ్నాపత్రాల లీకేజీకి తెలంగాణ రాష్ట్రం కేరాఫ్‌గా మారిందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ ఆరోపించారు. రాష్ట్రంలో వరుసగా పది పరీక్షల పేపర్ లీకేజీ కావడంపై పీడీఎస్‌యూ ఆధ్వర్యాన మంగళవారం ఎన్నెస్పీ క్యాంపులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ మరవక ముందే పది పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ కావడం పట్ల అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖమ్మం డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కరుణ్, వినయ్, నాయకులు కార్తీక్, సాయి, రాకేష్, గణేష్, పాల్గొన్నారు.

అలసత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం మూలంగానే పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు యువరాజు, సతీష్, బిట్టు, చందులాల్, వెంకటేష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం



నేలకొండపల్లి: మంగాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రమ్య



రఘునాథపాలెం: రాంక్యాతండాలోని కంటి వెలుగు శిబిరంలో పాల్గొన్న ఎంపీడీఓ, సర్పంచ్

నేలకొండపల్లి/రఘునాథపాలెం/కూసుమంచి: అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని నేలకొండపల్లి, కూసుమంచి ఎంపీపీలు బానోత్ శ్రీనివాసనాయక్, వజ్జా రమ్య, రఘునాథపాలెం ఎంపీడీఓ రామకృష్ణలు పేర్కొన్నారు. మంగళవారం నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాలో ఎంపీపీ రమ్య, రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో ఎంపీడీఓ రామకృష్ణ, కూసుమంచి మండలం పాలేరు, గైగోళ్లపల్లి గ్రామాల్లో ఎంపీపీ శ్రీనివాసనాయక్‌లు కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. మంగాపురంతండా కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల వైద్యాధికారులు ఆర్.శ్రావణ్‌కుమార్, మణిబాబు, హెచ్ఈఓ వీరన్న, ఎంపీటీసీ అరుణబాయి, ఉప సర్పంచ్ గుగులోత్ ధర్మా, రంక్యాతండా కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, సర్పంచ్ దారావత్ అమాలీ, పంచాయతీ కార్యదర్శి జాన్సీ, ఉపసర్పంచ్ బిచ్చు, వైద్యులు మహిధర్, సింధు, కుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూసుమంచి మండలంలోని కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు ఎడవెల్లి మంగమ్మ, ముల్కూరి శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని బోదకాలు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించిన కిట్లను మంగళవారం మండల వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ ప్రభుత్వ ఆస్పత్రిలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఫైలేరియా నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వీరన్న, ఫార్మసిస్ట్ జ్యోష్న, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..

ఖమ్మంవైద్యవిభాగం: తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయి.. ఆదర్శ వివాహం చేసుకున్న లావణ్యకు నగర బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా అండగా నిలిచింది. గత నాలుగు రోజుల క్రితం రాత్రి 12 గంటలకు గర్భంతో ఉన్న లావణ్య భర్త తరపు బంధువులు షకీనాకు ఫోన్ చేయడంతో ఆమె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆమెకు బీపీ ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రిలోనే ఉంచారు. మంగళవారం ఉదయం ఆమె పాప జన్మించినట్లు షకీనా తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం:/ఖమ్మంరూరల్: ఖమ్మం నగరంలోని 33 కేవీ రామాలయం సబ్ స్టేషన్ 11 కేవీ కమాన్ బజార్ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–5 ఏఈ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమాన్ బజార్ నుంచి క్రైం పోలీస్ స్టేషన్ వరకు, రావిచెట్టు రోడ్, రిక్కా బజార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండని చెప్పారు. అదేవిధంగా ఇల్లెందు క్రాస్ రోడ్ 33 కేవీ సబ్ స్టేషన్ 11 కేవీ జమ్మిబండ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–3 ఏఈ బి.తావుర్యా తెలిపారు. వైరారోడ్, పాత కలెక్టరేట్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. అంతేకాక ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ ఫీడర్, బైపాస్‌రోడ్ ఫీడర్, పెదతండా, జలగంనగర్ ఫీడర్ల పరిధిలోని లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ క్రాంతిసింహ తెలిపారు. అదేవిధంగా నగరంలోని 33 కేవీ దానవాయిగూడెం సబ్‌స్టేషన్ రాజీవ్ గృహకల్ప 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–1 ఏఈ మాల్సిక తెలిపారు. ఆటోనగర్, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించొద్దు



శంకుస్థాపన చేస్తున్న మేయర్, కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనులను నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని వైరారోడ్డులో పాత చేపలమార్కెట్ నుంచి కిన్నెర ఆస్పత్రి వరకు రూ.38.50 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణం కోసం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మేయర్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా, వర్షపునీరు రోడ్లపైకి చేరకుండా డ్రెయినేజీలను మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాల్వొడ్డులోని వీధివ్యాపారుల ప్రాంగణం నిర్మాణ పనులను పరిశీలించి ముగింపు దశలో ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు పాకాలపాటి విజయనిర్మల, డీఈ నవ్యజ్యోతి డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం..

నగరంలోని 32వ డివిజన్ జమలాపురం కేశవరావు పార్క్‌లో కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్, సుడా చైర్మన్ ప్రారంభించారు. అనంతరం కళ్లద్దాలు అందించారు.

క్రీడా ప్రాంగణ నిర్మాణానికి శంకుస్థాపన

నగరంలోని 40వ డివిజన్ రామచంద్రనగర్‌లో క్రీడా ప్రాంగణ నిర్మాణానికి మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ నిధులు రూ.42 లక్షల వ్యయంతో కేఎంసీ స్థలంలో అత్యాధునిక ఫుట్‌బాల్ క్రీడా ప్రాంగణం నిర్మించనున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంతలక్ష్మి జశ్వంత్, ఆర్‌జేసీ కృష్ణ, డీఈ ధరణి కుమార్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల నిత్యావసరాలు అందించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు

రఘునాథపాలెం: ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్ షాపులు)ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు, 10 కేజీల సన్న బియ్యం ఉచితంగా అందజేయాలని పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆవుల మంగతాయి, పీవైఎల్, పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షులు ప్రేమ్ సింగ్, స్వాతిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాంక్యాతండాలో అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన తలపెట్టిన ఉద్యమాలను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ.. ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 కేజీల చొప్పున మొత్తం 10 కేజీలు నాణ్యమైన సన్న బియ్యంతో పాటు అన్ని రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 1 నుంచి 15 వరకు గ్రామాలు, నగరాల్లో ప్రజాభిప్రాయం సేకరిస్తామని దీనికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ, పీవైఎఫ్ మండల నాయకులు బుజ్జి, సోని, రమేష్, సోమ్లా, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని తాళ్లచెరువు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు జంపాల పెద్ద రామనాథం మంగళవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈమేరకు సీపీఎం జిల్లా నాయకుడు బండి రమేష్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల నాయకులు ఎస్‌డీ జియాఉద్దీన్, రావుల వెంకట్రామిరెడ్డి, తుల్లూరి నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావులు తదితరులు రామనాథం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పోలేపల్లిలో..

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్ టీపీ నాయకులు బత్తిని యాలాద్రి, ఆడెపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 17 నుంచి సమ్మె..

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల సాధనకు ఈనెల 17 నుంచి నిర్వహించే సమ్మెలో ప్రజలంతా పాల్గొనాలని టీఈఈ 1104 యూనియన్ డిస్కమ్ కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వైరారోడ్డులో గల టీఈఈ 1104 యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల సాధనకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రాంతీయ కార్యవర్గ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ ప్రతినిధులు జి.లక్ష్మీనరసింహారావు, కె.శ్రీధర్, జీవీఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వరరావు, సురేష్, సీతారామయ్య, రమేష్, రమణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం..



పాలాభిషేకం చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కృషితో ఖమ్మం నగరంలోని ఎన్నెస్పీ కార్యాలయ గిరిజన భవనం మరమ్మతుల కోసం సీఎం కేసీఆర్ రూ.కోటి మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సేవాలాల్ సేన ఆధ్వర్యాన మంగళవారం మంత్రి అజయ్‌కుమార్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సత్యవతి రాథోడ్, కేటీఆర్, హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, కిషన్ నాయక్, రవిచంద్ర చౌహాన్, రంజిత్‌నాయక్, మత్రు నాయక్, అనితబాయి, రాజునాయక్, మంగీలాల్, వీరన్న, రమేష్, రామకృష్ణ, రాందాస్, బస్కినాయక్, ప్రమీలబాయి, బాల్‌నాయక్ పాల్గొన్నారు.

మంత్రి అభినందనలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

నియామకం

కూసుమంచి: యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా కూసుమంచి గ్రామానికి చెందిన బెల్లంకొండ శరత్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ విభాగం హెడ్ మనూ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శరత్ కన్వీనర్‌గా ఎన్నికవ్వడం ఇది రెండోసారి.

అటెన్షన్ ప్లీజ్

నిర్వహణ లేక.. నీరు పెట్టక!



ఎన్నెస్పీ క్యాంపులో అధునాతన మోడల్‌లో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్(రైతు బజార్)ను నిర్మించారు. ఈ మార్కెట్‌కు వచ్చిన వారికి ఆహ్లాదం పంచేలా ప్రధాన గేటుకు పక్కన గోడకు ఆనుకొని లాన్(పచ్చిక) వేసి పెంచారు. ఇటీవల కాలంలో ఆ లాన్‌ను పట్టించుకునేవారు లేకపోవడంతో అంతా ఎండిపోయింది. దీంతో మార్కెట్‌కు వచ్చిన వారు.. వేల రూపాయలు ఖర్చు చేసి వేసిన లాన్‌ను పటించుకోకుండా ఇలా ఎండబెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు.

- ఖమ్మంమయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : సమీకృత మార్కెట్ ఎస్టేట్ ఆఫీసర్
సెల్ నంబర్ : 91210 80180